# ఆవలిగట్టు

సంధ్యా, సూర్యం అనురాగంతో ఒకరి నొకరు చూసుకున్నారు.

ఆ చూపులకి సంధ్య సిగ్గుల మొగ్గలాగ ముడుచుకుపోయింది.

కళ్ళనిండా కాటుక, జడనిండా మల్లెపూల దండా, కొత్త చీర, నుదుటను అందంగా తీర్చిదిద్దిన కళ్యాణపు బొట్టూ, కొత్త పెళ్ళికూతురు అందాలతో సంధ్య, సూర్యం కళ్ళకి దేవకన్యలా కనబడుతోంది. నిన్నటిదాకా, కాలేజీలో చలాకీగా తిరుగుతూ, చూపులతోనే తనని కవ్విస్తూ, గలగలా నవ్వే సంధ్యకి పెళ్ళైనాక ఇలా ముగ్ధత్వం వచ్చిందేమిటి? అని, సంధ్యకి దగ్గరగా వచ్చి బుజంమీద చెయ్యివేసి సుతారంగా నొక్కాడు సూర్యం.

''ఏం? అలా, అదిరిపాటుపడ్డావేం?'' అని అడిగాడు.

''అహా, ఏంలేదు, ఎవరేనా చూస్తారు'' అంది గోముగా చూస్తూను.

''చూస్తే చూడనీ. కొత్త దంపతులు కదా, అన్యోన్యంగా ఉన్నారు అని సంతోషిస్తారు'' అన్నాడు సూర్యం.

ఆ సాయంత్ర సమయంలో సంధ్య నదిఒడ్డున ప్రకృతి తిలకిస్తోంది.

పసుపుగుడ్డ వాసినకట్టి కొత్త బిందెలు ముగ్గిముగ్గని అరటి పళ్ళగెల వాసన అస్వాదిస్తూ నదిమీంచి వస్తూన్న చల్లగాలి తన కురుల్ని తాకుతూ ఉంటే, అస్తమించబోతూన్న సూర్యకాంతి నులివెచ్చనిస్పర్శ కలిగిస్తూంటే, జడలో అరవిచ్చిన మల్లెలు గుబాళిస్తూంటే, ప్రకృతి అందాల్ని హాయినీ, మనసుని గిలిగింతలు పెడుతోంది, అనుకుంది.

మనసైనవాణ్ణి భర్తగా పొందిన ఆనందంతో, తనను తాను మరచి, పూచిన కొమ్మలా పులకించిపోయింది సంధ్య. సూర్యం ఆమె తత్తరపాటుని గమనించి, పకపక నవ్వాడు.

''ఎందుకలా నవ్వుతారు? అంది సిగ్గుతో సంధ్య.

ఎగిరే ముంగురుల్ని సవరించుకుంటూ, "పడవ ఇంకా రాలేదేమిటి?" అంది, మాట మారుస్తూ.

"అదిగో ఇంక వచ్చేస్తుంది. మనం అల్లా రేవులోకి వెళదాం" అన్నాడు.

"నాకు పడవ ప్రయాణం కొత్త. భయంగా ఉంది."

''మరి అయితే ఎలాగా? మా వూరికి వెళ్ళాలంటే వేరే దారే లేదు. ఎట్టి పరిస్థితిలో అయినా, ఈ ఏరు దాటవలసిందే నువ్వు''.

"నీళ్ళలో ప్రయాణం సరదానే; కాని భయం ఇంటికి వెళ్ళాక మీ అమ్మా నాన్నా ఏమంటారో అనే ఆదుర్దా ఒకటి ''అలా అంటూనే కంటిలో వచ్చిన నీటి పొరని కనబడకుండా కళ్ళు తుడుచుకుంది సంధ్య.

''జట్కా! జట్కా కావాలాండి?'' అంటూ అరుపులూ, గోదావరిలో పడవలవాళ్ళ కేకలూ, నది ఒడ్డున ఎత్తైన గట్టు మీద ఆగిన రిక్షాలవాళ్ళ కేకలూ ప్రయాణీకుల మాటల సందడితో రణగొణ ధ్వనిగా ఉంది ఆ ప్రదేశం అంతాను. ఇంతలో ఒక రిక్షా వచ్చి ఆగింది. సామానూ, పిల్లలూ, రకరకాల మూటలతో దిగారు. అందులో వయసు మళ్ళినామె, శ్రమ పడుతూ దిగింది. రెండు రూపాయలు చేతిలో పెట్టింది రిక్షావాడికి. దాంతో వాడికి కోపం తార స్థాయిని అంటింది.

''ఏందమ్మా, ఈరోజుల్లో రెండు రూపాయలకి ఏమొస్తుంది? ఇందరి పిల్లల్ని, సామానుల్ని బస్సుస్టాండు కాడనుంచి, రేవు కాడికి తీసుకువచ్చాను. రెండు రూపాయలిస్తావా? మా కష్టం చూడవే?'' అన్నాడు ఆవేశంతో.

''రిక్షా ఎక్కేటప్పుడు ఒకలా మాట్లాడతారు, ఎంతో కొంత ఇవ్వండమ్మా అంటూను. తీరావచ్చాక, ఎన్ని డబ్బులు ఇచ్చినా చాలదు. సినీమాలు చూసాక, మాటలు నేర్చారురా. ఇంద తీసుకో''లంటూ మరొక రూపాయి విసిరింది, కసురుతూనే, ఆమె.

''ఏందమ్మా ఆ కోపం? నాకు అయిదురూపాలియ్యి. నువ్వు ఊరికే ఇస్తున్నట్లు అరుస్తున్నావు? నీ డబ్బులసలు నాకు వద్దు, మా రెక్కలు చల్లగా ఉండాలేకాని, గంటలో పదిరూపాయలు సంపాదిస్తాను,'' అని డబ్బులు తీసుకోకుండానే వెళ్ళిపోయాడు ఆ రిక్షావాడు

సూర్యం, సంధ్యా ఇదంతా వింటున్నారని కనిపెట్టిందామె.

''చూసారా చూసారా? ఎలా అరుస్తున్నాడోను!'' అంది.

''మీరు, ఇంత సామానుతో ప్రయాణం చేయకూడదు; ఇంతమంది పిల్లలతో'' అని మాట ఇంకా సంధ్య పూర్తిగా అనలేదు.

ఆమె, ఆ మూటలను, పిల్లలను, బరబర ఈడ్చుకుంటూ, పడవల రేవుకేసి వెళుతూ, ''అనండి, అనండి అందరూ నన్ను అనండి'' అంటూ వెళ్ళిపోయింది.

వెడుతూన్న రిక్షావాణ్ణి చూస్తే నిజంగానే జాలేసింది. సన్నగా, నల్లగా, చెమటలుకారుకుంటూ వెళ్ళాడు అని సూర్యం మనసు బాధపడింది. కాని, లోకం తీరు ఇలా ఉంది అనుకుని తనలో తను సమాధానపడ్డాడు పెద్దగావు కేక వినిపించడంతో, ఉలిక్కిపడి అటూ చూసారు సంధ్యా సూర్యమూను.

అల్లంత దూరాన అగండి దగ్గిర అల్లరవుతోంది.

పప్పులుండలూ; తాడుకి గుచ్చి వేలాడకట్టిన జంతికలూ ఒక ప్రక్కన; అరటిపళ్ళ గెల మరియొక వైపున ఉన్నాయి. చాంతాడుకి నిప్పురగులుతూ ఉంది. వచ్చే పోయేవాళ్ళు చుట్టకు నిప్పంటించుకునిపోతున్నారు. ముప్ఫై ఏళ్ళ వాడు, నల్లగా బలంగా ఉన్నాడు పంచెకట్టు వెనక్కి మడిచికట్టి. కొట్టు దగ్గిర కొచ్చి నిలబడి, కొట్లో కూచున్న అమ్మాయికేసి కోరగా చూసి, "రెండు అంటి పళ్ళు ఇయ్యి, రెండు చుట్టలు,'' అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడుతూ, అడిగాడట. ఇచ్చాక డబ్బులు చేతులో పెడుతూ, చెయ్యినొక్కాడుట. దాంతో, ఆ పదహారేళ్ళ అమ్మాయీ, గావుకేక పెట్టి, వలవల ఏడ్చేసిందిట.

నలుగురూజేరి, ఏందని అడిగారుట.

''ఏందయ్యా, అల్లా అరుస్తారు? నేనేం తప్పుచేశానని? చిల్లర డబ్బులు చేతిలో పెడుతోంటే, ఉలిక్కిపడుతోందీ గుంట'' అంటూ అందరికేసీ కోపంగా చూసి, ఆ పిల్లకేసి మళ్ళీ చూసి, అరటిపండు ఒలుచుకుని తింటూ వెళ్ళిపోతున్నాడు.

అక్కడజేరినవాళ్ళంతా, అంతా విని, ఆ పిల్లకేసి ఒకసారి జాలిగా చూసి చేసేదేంలేక, వారి వారి పనుల్లోకి వెళ్ళిపోయారు.

ఆ కొట్లో కూర్చున్న అమ్మాయి, ఏక ఎక్కెక్కి ఏడుస్తూ, పమిట కొంగుతో కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ, మధ్య, మధ్య బేరంకోసం వచ్చినవాళ్ళకి సరుకులిస్తూ, డబ్బులు గళ్ళాపెట్టెలో వేసుకొంటూంది. అది చూసి, ఓ ముసలమ్మ ''ఏమే! అమ్మాయీ, నీ తండ్రి రోగంతో మంచాన పడ్డాడు. నిన్ను చూస్తే అందరికీ లోకువేనే" అంది.

''నేనేటి చేసేది చెప్పు అవ్వా?" అంది బేలగా ఆ అమ్మాయి

'నువ్వే, ఎవరినేనా ఎన్నుకుని మనువాడేయకూడదూ?' అంది, "నాకేటి తెలుస్తాది ఎట్టాంటోణ్ణి మనువాడాలోనూ. నేనా సదువుకోలేదు. లోకం తెలియదు" అంది ఆ కొట్లో అమ్మాయి.

"అదేనే అమ్మా! ఆడదాని జీవితం ముందుకు పోతే నుయ్యి. వెనక్కి పోతే గొయ్యానూ," అంటూ కర్ర ఆసరాతో, మెల్లగా నడుచుకుంటూ, వెళ్ళి

పోయింది ముసల్ది. సూర్యం, సంధ్యా అంతా విన్నారు. అమ్మాయి అవస్థ గమనించారు. ఒకరి నొకరు చూసుకున్నారు.

సంధ్య ఆవేశంగా, ఆ కొట్లో కూచున్న అమ్మాయికేసి కుడిచేత్తో సంజ్ఞ చేస్తూ, "ఇలారా ఒకసారి" అని పిలిచింది.

ఆ పిల్ల "నన్నేనా పిలుస్తూంట నేనురాను బాబూ!" అంటూ కొట్లో కూచునే చేతితో సంజ్ఞచేసి చెప్పింది.

సంధ్య మళ్ళీ పిలిచింది. ఆ కొత్త దంపుతుల అందాన్నీ, వాళ్ళముఖంలో ఉన్న మంచితనాన్నీ గమనించి, కొట్టులో ఎవరినో కూచోమని, మెల్లగా అడుగులు వేసుకుంటూ, వచ్చి భయంగా తలవంచుకుని వచ్చి నుంచుంది మెల్లగా చేతులెత్తి ''దండాలండి" అంది.

"అవునూ, నువ్వు చదువుకుని, పెద్దదానివి అవచ్చును కదా? ఇలాంటి చోట నిత్యమూ, అవమానాలు భరిస్తూ ఉండడం కంటే నయం కదా?'' అంది సంధ్య.

"నాకా చదువు? ఎవరు చెప్పిస్తారు? మాలాంటి వాళ్ళకి చదువు వస్తుందాండీ?'' అంది వినయంగా చూస్తూను.

"ఊ! తప్పకుండా వస్తుంది. హాస్టల్పు ఉన్నాయి, గవర్నమెంటువారు పెట్టినవి. అందులో జేర్పిస్తాము, నువ్వు చదువుకుంటానంటేను'' అంది.

''అయితేమరి మా రోగిష్టి నాయనో?'' అంది ఆ పిల్ల.

''గవర్నమెంటు హాస్పిటల్సు ఉన్నాయి. అందులో జేర్పిస్తే సరి. మీ అయ్యకు ఆరోగ్యం వస్తుంది, నీకు చదువూ వస్తుంది. నిత్యమూ, ఈ చదువుకోని వాళ్ళ మధ్యన బాధా తప్పుతుంది'' అంది సంధ్య.

"అమ్మగారూ! చదువుకున్నవాళ్ళు అందరూ మంచివాళ్ళంటారా? నాకు తెలవక అడుగుతాను. అహా! ఏమనుకోకండి" అంది ఆ అమ్మాయి.

ఆ మాటలకి వెంటనే కొంచెం ఇబ్బంది పడి, "చదువుకున్న వాళ్ళల్లో కూడా కొందరు చెడ్డవాళ్ళు ఉండొచ్చును. కాని, ఎలాంటివారో తెలియాలంటే నీకు చదువు ఉండాలి కదా? అప్పుడు నిన్ను నువ్వు కాపాడుకోగలవు'' అంది సంధ్య.

''మీరు చెప్పినదీ నిజమే. మీ సహాయం నాకుంటే, మీ కాళ్ళకి మొక్కుతాను. తనువంతా రుణపడి ఉంటాను.''

''తప్పకుండాను. నీకు అన్ని ఏర్పాట్లూ చేస్తాము" అంది సంధ్య.

"మేము తిరిగి పట్నం వెళ్ళేటప్పుడు, నిన్నూ, మీ అయ్యనూ తీసుకు వెళ్ళి అతణ్ణి హాస్పిటల్‌లోనూ, నిన్ను చదువుకునే స్కూల్లోనూ జేరుస్తాము'' అన్నాడు సూర్యం. ఈ మాటలు ఆమెకు కొండంత ధైర్యాన్నిచ్చాయి.

''పడవ వెళ్ళిపోతుందేమో, మేము వెడతాము," అంది సంధ్య ఆప్యాయంగా. సామాను తీసుకుని పడవదగ్గిరకి బయలు దేరారు. కొట్టు అమ్మాయి పడవదాకా వెళ్ళి వీడ్కోలు చెప్పింది. పడవలో కూర్చున్న సంధ్యా, సూర్యం, ఉదయిస్తూన్న చంద్రోదయం చూస్తూ, ఆకాశంలో, మినుకుమంటూన్న నక్షత్రాల్ని చూస్తూ పరవశిస్తున్నారు. నీళ్ళల్లో పడవ తూగుతూ వెళుతూంటే, వయసులోని కోరికలు మనసుని అలరిస్తూంటే, పడవ ప్రయాణం, నవ వధూవరుల్ని. అలరించింది. క్రింద గోదావరీ నదీ, పైన చంద్రకాంతీ, వెన్నెల్లో పడవ ప్రయాణం బాగానే ఉంది. "అయినా, మీ నాన్నగారూ, అమ్మగారూ మన పెళ్ళి గురించి, ఏమంటారోనని భయంగా ఉంది'' అంది సంధ్య.

''నేను నా తల్లితండ్రులకు చెప్పి ఒప్పించి, వస్తానంటే ససేమిరా వినను అన్నావు, మన పెళ్ళికాకపోతే చస్తానని బెదిరించావు. ''ఇప్పుడు నా తల్లి తండ్రుల దృష్టిలో ఎలా కనిపిస్తాను?" అన్నాడు సూర్యం.

సంధ్య తను చేసిన తొందరపాటుకి కించపడింది. కళ్ళనీరు కార్చింది. క్షమించమంది. అంతే. సూర్యం నవ్వుతూ కళ్ళతోనే ఓదార్చాడు.

ఇంటికి వెళ్ళగానే గుమ్మంలోనే కనిపించిన తండ్రి తలపంకించి, అంతా అర్థం చేసుకుని. ''ఏమేవు ఇల్లాలా! నీ కొడుకు ఒక రత్నాన్ని తీసుకు వచ్చాడే'' అన్నాడు. చూడగానే గ్రహించిన ఆ ఇల్లాలు, హారతి ఇచ్చి, నవ దంపతులను ఇంట్లోకి ఆప్యాయంగా తీసుకువెళ్ళింది.

సంధ్యకి ఆశ్చర్యం వేసింది ఇలాంటి మంచి మనుషులు ఉంటారా? అని. వారిని పార్వతీ పరమేశ్వర్లుగా భావించి నమస్కరించింది మనస్సులో కొట్టు అమ్మాయి మెదిలింది - తను జీవితంలో ఆవలిగట్టు జేరింది - ఆ పిల్లని కూడా చేర్చాలి అనుకొంది.

*

(రేడియో - '85)